క్లుప్తంగా

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లోని కొత్త జిల్లాలకు హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడం హర్షణీయం అని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి యస్‌వి సుబ్బారెడ్డి అన్నారు. గతంలో మంత్రివర్గ ఉప సంఘంలో జేఏసీలు డిమాండ్ చేసిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెంషనర్ల డిమాండ్లను ఒకొక్కటిగా పరిష్కరిస్తూ ఉండటాన్ని పీఎస్‌టీయూ స్వాగతిస్తుందన్నారు. అలాగే డీఏ బకాయిలు, సంపాదిత సెలవు డబ్బులను కూడా తొందరలో పరిష్కరించి బకాయిలను చెల్లించాలని కోరారు.

ఊటుకూరులో తాగునీటి సమస్య

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఎస్‌ఆర్ నగర్, ఊటుకూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 75 కుటుంబాలు ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజలు సరైన నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతూ, ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు సైతం అర్జీ పెట్టుకున్నారు. ఇంతవరకూ ఆ సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుత వేసవి కాలంలో ఇది మరింత తీవ్రరూపం దాల్చింది. మున్సిపల్ అధికారులు చొరవ చూపి తమకు వెంటనే వాటర్‌పైపులైన్ మంజూరు చేసి, నీటి సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వన్‌టౌన్ ఎస్‌ఐగా రంగస్వామి బాధ్యతలు



కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ ఎస్‌ఐగా వి.రంగస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్‌ఐగా జిల్లాలోని మైలవరం, ప్రొద్దుటూరు రూరల్, రాజంపేట, బి.మఠం పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. తరువాత కడప విజిలెన్స్ విభాగంలో పని చేశారు. అక్కడి నుంచి కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐగా నియమించడంతో విధుల్లో చేరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ మాసాల్లో అకాల వర్షాలతో జిల్లాలో అరటి, బొప్పాయి, మామిడి తమలపాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యావన పంటలకు ఎకరాలకు రూ. 40 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శులు జయన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వినతి



డీయం అండ్ హెచ్‌వో నోడల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డీఎంఅండ్ హెచ్‌ఓ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమా మహేశ్వర్‌కు వినపతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. 104 ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వమే నేరుగా నిర్వహించి ప్రతి నెల 5వ తేదీ లోపల వేతనాలను ఇవ్వాలని కోరారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆలీ, జిల్లా కార్యదర్శి బాబా పకృద్దీన్, మహేష్, సురేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు ఏపీటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులందరికీ విద్యాశాఖ నాన్ వేకేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన వ్యక్తులుగా గుర్తించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్, జిల్లా సంయుక్త అధ్యక్షుడు ఈశ్వరచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వారు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను తగ్గించడమే కాకుండా పూర్తిగా సెలవుల్లో ఉపాధ్యాయులతో పనిచేయించుకునే దిశంగా రాష్ట్ర విద్యాశాఖ ఉందన్నారు. నాడు- నేడు, రెమిడియల్ క్లాసులు, ఉయ్ లవ్ రీడింగ్, ఎన్‌రోల్‌మెంట్, వ్యాయామ శిక్షణా తరగతులు అంటూ ఉపాధ్యాయులను పూర్తిగా వేసవి సెలవుల్లో వినియోగించుకోవడం సరికాదన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఎలిచర్ల గజేంద్రనాథరెడ్డి రచించిన 'నా సీమ యాసే నా శ్వాస' పుస్తక పరిచయసభ నిర్వహించనున్నారు. బ్రౌన్ కేంద్రం బాధ్యులు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్యులు హాజరుకానున్నారు.

పది ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలల్లో జోష్

- అంధుల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత
- శీలం నాగయ్య ఎంసీయూహెచ్‌ఎస్‌లో 91.89 శాతం ఉత్తీర్ణత
- ఉర్దూ కాగితాలపెంట జెడ్పీలో 89.13 శాతం ఉత్తీర్ణత
- 550కు పైగా మార్కులతో మెరిసిన విద్యార్థులు



వందశాతం ఉత్తీర్ణతను సాధించిన అంధుల గవర్నమెంట్ హైస్కూల్



ఉత్తమ మార్కులు సాధించిన ఉర్దూ బాలుర హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న మేయర్

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలలు ఫుల్ జోష్‌లో ఉన్నాయి. ముఖ్యంగా చాలా పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రావడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరగడం తెలిసిందే. అందుకనుగుణంగా మంచి విద్య కూడా సర్కారీ పాఠశాలల్లో అందుతోందని ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి..

కడప నగరంలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రెండు పాఠశాలలకుగాను 126 మంది విద్యార్థులు పరీక్షరాయగా 70 మంది పాస్ అయి 55.56 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో అంధుల హైస్కూల్లో 8 మంది పది పరీక్షలను రాయగా 8 మంది పాస్ అయి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో వ్యక్తిగతంగానూ కొందరు విద్యార్థులు మంచి మార్కులు సాధించడం విశేషం. ప్రభుత్వ బాలికల పాఠశాలలో జోషిత 585 మార్కులు సాధించి శభాష్ అనిపించింది.

మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి..

నగరంలోని మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. శీలంనాగయ్య వీధికి చెందిన మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్లో 37 మంది పరీక్షరాయగా 34 మంది పాస్ అయి 91.89 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అలాగే నకాష్ మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో 22 మందికి 19 మంది పాస్ అయి 86.36 శాతం, బాలికల ఉర్దూ హైస్కూల్‌లో 127 మందికి 100 మందిపాస్ అయి 78.74 శాతం, నాగరాజుపేటకు చెందిన మున్సిపల్ హైస్కూల్లో 54 మందికి 36 మంది పాస్ అయి 66.67 శాతం, ఉర్దూ మున్సిపల్ బాయిస్ మెయిన్ స్కూల్‌లో 104 మందికి 69 మందిపాస్ అయి 66.35 శాతం, గాంధీనగర్ హైస్కూల్లో 192 మందికి 117 మందిపాస్ అయి 60.94 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇక మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌కు చెందిన ప్రజ్వల 578 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలువగా ఉర్దూ బాయ్స్ హై స్కూల్‌కు చెందిన షేక్ ఓవైసీ 572 సాధించి ద్వితీయస్థానంలో నిలిచింది.

జెడ్పీ మ్యానేజ్‌మెంట్‌కు సంబంధించి..

జిల్లా పరిషత్తు మేనేజ్‌మెంట్ పాఠశాలలు కూడా మెరిశాయి. కాగితాలపెంట ఉర్దూ హైస్కూల్లో 46 మందికి 41 మందిపాస్ అయి 89.13 శాతం ఉత్తీర్ణత సాధించగా చెమ్మియాపేట బాలికల హైస్కూల్లో 96 మందికి 72 మంది పాస్ అయి 75 శాతం, చెమ్మియాపేట బాలికల హైస్కూల్లో 10 మందికి 7 మంది పాస్ అయి 70 శాతం, జయనగర్‌కాలనీ జెడ్పీ హైస్కూల్లో 122 మందికి 75 మందిపాస్ అయి 61.48 శాతంతో మంచి ఫలితాలు సాధించాయి. ఇక చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్లో ప్రణతి 575 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలువగా జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ సామియా పర్వీన్ 571 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచింది. అలాగే ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ పాఠశాల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. చాలా మంది విద్యార్థులు 500కు పైగా మార్కులతో సత్తా చాటారు.



జోషిత



ప్రజ్వల



ప్రణతి



షేక్ ఓవైసీ



షేక్ సామియా పర్వీన్



విష్ణువర్ధన్



లోహిత

రేపు కాలభైరవాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగరం ఎంఎస్ కొట్టాల కాలభైరవపురంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాల భైరవస్వామి ఆలయంలో శుక్రవారం కాల భైరవాష్టమి పూజలను నిర్వహించనున్నట్లు నిర్వాహకు లు మేరువ బాలాజీరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8.00 గంటలకు అభిషేకం, అనంతరం అష్టోత్తరం, కాలభైరవ స్తోత్తం, కుష్మాండ దీపసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సెలవుల్లో విధుల నిర్వహణపై ఆదేశాలు సరికాదు

కడప ఎడ్యుకేషన్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను విధులు నిర్వహించమని విద్యాశాఖ అధికారులు పేర్కొనడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మెన్ మాదవ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలకు వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో నాయకులు బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. ఇలాంటి నిర్బంధ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఫ్యాప్టో కోశాధికారి చెన్నకేశవరెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, పాలం మహేష్‌బాబు, ఖాదర్‌బాషా, అబ్దుల్లా, వంశీకృష్ణ, నాగభూషణం పాల్గొన్నారు.

కళల్లో కడప ప్రత్యేక ముద్ర



కర్నాటక సంగీతం విభాగం విద్యార్థులతో లలితకళల విభాగం అధ్యాపకులు

వైవీయూ : కళల కాణాచీగా కడప గడప తన ప్రత్యేకను నిలుపుకుంటోందని వైవీయూ లలితకళల విభాగం ఆచార్యులు డా.మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు వాయిద్యాలకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మూడు సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకుని కళాకారులుగా ప్రపంచంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులను అభినందించారు. లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని, తమ కళను మరింత మెరుగుపరుచుకుని మంచి కళాకారులుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో లలితకళల విభాగం అధ్యాపకులు డా.కె.రెడ్డిశేఖర్ రెడ్డి, వి.సుధాకర్, ఎం.కామేశ్వరి, జి.వెంకటేశ్వర రావు, వి.సుబ్బరాయుడు, కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్షేమం కోసం మహాయజ్ఞంలో పాల్గొందాం!



మాట్లాడుతున్న జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయ్‌భట్టర్

కడప కల్చరల్ : రాష్ట్రం సుభిక్షంగా ఉండడం కోసం దేవదాయ ధర్మదాయ శాఖ ఈనెల 12 నుంచి 17వ తేది వరకు విజయవాడలో నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో ప్రజలు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ పిలుపునిచ్చారు. బుధవారం బ్రాహ్మణవీధిలోని తమ కార్యాలయంలో ఆయన సంఘం సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన శక్తియుక్తులన్నీ రంగరించి నవరత్నాలతో సహా మరెన్నో ప్రజా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని, దాదాపు ప్రతి ఇల్లు ఏదో ఒక పథకంతో లబ్ధి పొందిందని అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి మరెన్నో పథకాలు విజయవంతంగా మొదలై సుఖ సంతోషాలతో రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కోరుతూ విజయవాడలో ప్రభుత్వం పక్షాన ప్రత్యేకంగా హోమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం తలపెట్టిన ఈ మహాయజ్ఞంలో ప్రజలు విరివిగా పాల్గొని పుణ్యఫలాలు పొందాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మార్నింగ్ విజిట్‌లో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తున్న కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన మరియాపురంలో ఫుట్‌పాత్, అక్కాయపల్లె పబ్లిక్ టాయ్‌లెట్లు, సంధ్యా సర్కిల్‌లో ఫుట్ పాత్ పనులు, రాజీవ్‌మార్గ్ రోడ్, రాజీవ్ పార్కు, మాసాపేట రోడ్డులో కాలువ నిర్మాణ పనులు, పాత కడప చెరువు పక్కన కేసీ కెనాల్ రోడ్డులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. రాజీవ్ మార్గ్‌లో రోడ్డుపై మట్టి లేకుండా క్లీన్ చేయించాలని, ప్యాచెస్‌కు మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని అందుబాటులోకి తేవాలి

పోరుమామిళ్ల : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం జరిగిన డివిజన్‌లోని రైతు భరోసా కేంద్రాల అసిస్టెంట్ల సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అయితే నాగేశ్వరరావు పాల్గొన్నారు. వ్యవసాయ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన డ్రోన్ టెక్నాలజీ రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. దానిపై అర్హులైన వారికి పైలట్ శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్‌బీకేలలో నిర్వహించాల్సిన 29 రిజిష్టర్ల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, 5 మండలాల వ్యవసాయాధికారులు, ఆర్‌బీకేల అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పర్యావరణానికి అనుగుణంగా జీవనశైలి

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణానికి అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవాలని అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో బుధవారం లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) మిషన్‌లో భాగంగా పర్యవరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని చెప్పారు.అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర లక్ష్మయ్య, సెక్షన్ ఆఫీసర్ రమణ, బీట్ ఆఫీసర్స్ రమేష్, రాజేష్, ఉష, ఈశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

మూన్ ఫుట్‌బాల్‌తో మోసపోవద్దు

– కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్: ఆన్‌లైన్ మోసగాళ్లు నిన్నటి వరకు జీ.వి ఫుట్‌బాల్ గేమింగ్ యాప్‌తో ప్రజల నుంచి భారీగా పెట్టుబడులను పెట్టించి మోసం చేశారు. ఆ యాప్ నిర్వాహకులను గుర్తించేందుకు, ఈవెంట్ ఆర్గనైజర్లపై చర్యలు తీసుకుంటున్న సమయంలోనే ఆన్‌లైన్‌లో మరో గేమ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ గేమింగ్ యాప్ మూన్ ఫుట్‌బాల్ ప్రత్యక్షమైంది. ఈ యాప్‌ను చూసి ఎవరూ మోసపోవద్దనీ కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు సూచించారు. జీ.వి ఫుట్‌బాల్ యాప్‌కు సంబంధించి ఎవరైనా బాధితులు వుంటే ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

22 రేషన్ బియ్యం బస్తాల పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చెమ్మూమియాపేటలో అక్రమంగా ప్రభుత్వ రేషన్ బియ్యంను నిల్వ ఉంచిన సుబ్బారెడ్డిని అరెస్ట్ చేశారు. అతని దగ్గర నుంచి 22 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.

న్యాయవాదిపై కేసు.. పాత కలెక్టరేట్‌లోని వినియోగదారుల ఫోరంలో ఈనెల 9న న్యాయవాది చంద్రవదన తమ విధులకు ఆటంకం కలిగించిందని సూపరింటెండెంట్ సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

అక్రమ తవ్వకాలు సరికాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని వైఎస్సార్ కాలనీ, చలమారెడ్డి పల్లె సమీపంలోని కొండలను అడ్డగోలుగా తవ్వి పర్యావరణానికి ఆటంకం కలిగించడం తగదని బీజేపీ, బీజేవైఎం నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. కొంత మేర అనుమతులు పొంది ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర కమిటీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అలాగే సెంట్రల్ విజిలెన్స్ కమిటీతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్యాణ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు దస్తగిరి, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

మట్టి మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్‌సర్కిల్ : జిల్లాలో మట్టి మాఫియాను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఇసుక, ఎర్రచందనం, భూ మాఫియా కంటే మట్టి మాఫియా ఎక్కువగా తయారైందన్నారు. జిల్లాలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అండదండలతో మట్టి మాఫియా పేట్రేగి పోతోందన్నారు. రైతుల భూముల పేరుతో మట్టిని అడ్డూ అదుపు లేకుండా ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటున్నారని తెలిపారు. నగరంలోని పుట్లంపల్లె చెరువు, చెర్లోపల్లి చెరువు జిల్లాలోని గోపవరం చెరువులో ఇష్టానుసారంగా తవ్వుతున్నారని తెలిపారు. నాయకులు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

నాలుగు ఈ-స్టాంపింగ్ కేంద్రాలు మంజూరు

కమలాపురం : కమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నాలుగు ఈ–స్టాంపింగ్ కేంద్రాలు మంజూరు అయినట్లు సబ్ రిజిస్ట్రార్ డీఎం బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణంలోని యాసీన్ ప్లాజా సమీపంలో షేక్ మహబూబ్‌వలి, పెద్దచెప్పలి బైపాస్ రోడ్డు నందు పి.వెంకటరమణ, కమలాపురం ఆర్‌ఎస్ రోడ్డులోని శివకిషోర్ రెడ్డి, కమలాపురం స్టేట్ బ్యాంక్‌లకు ఈ సెంటర్లు మంజూరు అయ్యాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వీరు కూడా స్టాంపులు విక్రయిస్తారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారత్ మత సామరస్యానికి నిదర్శనం

కడప రూరల్ : భారతదేశం మత సామరస్యానికి నిదర్శనమని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆడిన నాటకమే కేరళ స్టోరీ సినిమా అన్నారు. అయితే ఆ పన్నాగం బెడిసి కొట్టిందన్నారు. హిందూ, ముస్లింల అనుబంధాన్ని ఏ దుష్ట శక్తి విడదీయలేదని తెలిపారు. కర్నాటకలో జరుగుతున్న ఎన్నికల దృష్ట్యా హిందూ, ముస్లింల మధ్య వ్యతిరేక భావం సృష్టించి పబ్బం గడుపుకోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాటకమాడిందని ఆరోపించారు.

గ్రంథాలయంలో 'కథా సమయం'



నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు

కడప కల్చరల్ : కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాలల వేసవి వినోదం శిక్షణ తరగతుల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా బుధవారం కథా సమయం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రీసోర్స్ పర్సన్ జేమ్స్ విద్యార్థులతో చిన్నచిన్న కథల పుస్తకాలు చదివించారు. ప్రతి కథను విశదీకరిస్తూ అందులోని సారాంశం గురించి అడిగి తెలుసుకున్నారు. మరింత ధారాలంగా చదవాలంటే భాషపై మరింత పట్టు సాధించాలంటే పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. చిత్రలేఖన ఉపాధ్యాయులు చంద్రశేఖర్ చిన్న చిన్న బొమ్మలు వేయడం, అలా వేసేందుకు అవసరమైన మెళుకువలను వివరించారు. క్రాఫ్ట్ టీచర్ రంగ నాయకులు రంగురంగు పేపర్లతో ఫ్లవర్ వేజ్‌లు తయారు చేయడం నేర్పారు. అనంతరం డ్యాన్స్ మాస్టర్ విద్యార్థులతో నృత్యంలో ప్రాథమిక అంశాలను బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం 'వై' జంక్షన్



వై జంక్షన్ వద్ద ప్రమాదకర పరిస్థితుల్లో డ్రైనేజీ పైకప్పు



ప్రమాదకర పరిస్థితుల్లో డ్రైనేజీ కాలువ

కడప సిటీ : కడప నగరంలోని వై జంక్షన్ పరిసర ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఆర్టీసీ బస్టాండు వైపు నుంచి వెళ్లే సమయంలో ఎడమవైపున మూడు డ్రైనేజీ గుంతలు ప్రమాద సూచికలను తలపిస్తున్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో డ్రైనేజీకి సంబంధించిన కాలువలతోపాటు రెండు నాళాలకు సరైన రక్షణ కల్పించకపోవడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సంబంధిత ప్రాంతాల్లో వాహనదారులు గమనించేందుకు కూడా ఎటువంటి బోర్డులనుగానీ, బారికేడ్లుగానీ ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ప్రమాదానికి గురవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు వాహనదారుల ఇబ్బందులను గుర్తించి సంబంధిత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌లపై చర్యలు

అనుడా వీసీ వై.ఓ.నందన్



మాట్లాడుతున్న అనుడా వీసీ వై.ఓ.నందన్

బద్వేలు అర్బన్ : ఆయా పంచాయతీలలో నిర్మించే భవనాలకు, ఏర్పాటు చేసే లేఅవుట్‌లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అనుడా) అనుమతి తప్పనిసరిగా ఉండాలని, అలా లేని వాటిపై చర్యలు తీసుకోవాలని అనుడా వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బద్వేలు, గోపవరం మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ప్లానర్స్)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలచెరువు, గోపవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన అనుమతులు లేని లేఅవుట్లకు నోటీసులు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీల్లో 300 చదరపు మీటర్ల వరకు వైశాల్యం ఉన్న భవనాల అనుమతులు పంచాయతీ కార్యదర్శుల వద్దనే తీసుకోవాలని, 300 చదరపు మీటర్ల పైన వైశాల్యం కలిగిన భవనాల అనుమతులు, లేఅవుట్ల అనుమతులు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వద్ద తీసుకోవాలని కోరారు. ఆయా పంచాయతీల్లో ఉన్న అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడవద్దని సూచించారు. సమావేశంలో అనుడా ఏపీఓ క్రిష్ణసింగ్, డబ్ల్యూపీఆర్ఎస్‌లు శ్వేత, సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పొదదుర్తిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని లేటపల్లె సచివాయల పరిధిలోని పొదదుర్తి, వెంకటాపురం, వై.కొత్తపల్లె, ఎర్రబల్లె గ్రామాల్లో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, జరిగిన లబ్ధిని వివరించారు. పొదదుర్తిలో స్మశానానికి ప్రహరీ, ఇతర గ్రామాల్లో రోడ్లు, ఇండ్లు, ఇంటి స్థలాలు, భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పార్టీలు, వర్గాలు, కులాలు, మతాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన జగనన్నకు ప్రజల తరపున తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఓబుల్‌రెడ్డి, రెడ్డయ్య, రాఘవరెడ్డి, శ్రీనువాసులురెడ్డి, ఉత్తమారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, నిఖిల్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, అయ్యావారయ్య, చెన్నారెడ్డి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని 18వ డివిజన్ సచివాలయ పరిధిలోని మూలవంక గ్రామంలో గురువారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారిని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

చెన్నూరు : మండలంలోని దౌలతాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 60 దేవాలయాలను మంజూరు చేశామన్నారు. గ్రామంలో రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా గ్రామస్తులందరూ కలసికట్టుగా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, కరెంటు సమస్య, రోడ్ల సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురాంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పీసీ కేశవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గురు మహేష్ రెడ్డి, కరుణాకర్, రాఘవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.